సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం ¦ 26 ¦ మార్చి ¦ 2025



దంపతుల మృతికి కారకుడిని ఎలా వదిలేస్తారు?

దంపతుల మృతికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు వదిలి పెట్టడంపై గ్రామస్తులు పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. 11లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ॥ (సా॥)	సహర్ గురు॥ (ఉ॥)
కడప	6.31	5.01
పులివెందుల	6.33	5.06
ప్రొద్దుటూరు	6.32	5.05

గరిష్టం/కనిష్టం
38.2/24.9

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.9 – 38.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

దేశంలో బుకీలు పడ్డారు!

- టీడీపీలో చేరిన బెట్టింగ్ డాన్ కుటుంబ సభ్యులు
- రాయలసీమ జిల్లాలకు విస్తరించిన బెట్టింగ్ సామ్రాజ్యమతడిది
- ప్రొద్దుటూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలో కేసులు



25వ వార్డు కౌన్సిలర్ షేక్ మెహరూన్‌తోపాటు కుటుంబ సభ్యులను కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



సాక్షి టాస్క్‌ఫోర్స్: క్రికెట్ బెట్టింగ్ డాన్‌గా గుర్తింపు పొందిన కీలక బుకీ అతడు.. క్రికెట్ పందేలు నిర్వహిస్తున్న వారికి ఇతని పేరు తెలియకుండా ఉండదు. ప్రొద్దుటూరు వాసే అయినా జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్ రాయుళ్లకు బాగా సుపరిచితుడు. ప్రొద్దుటూరులోని వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో 25వ వార్డుకు చెందిన అతడు ఒక బెట్టింగ్ సామ్రాజ్యాన్నే నడిపిస్తున్నాడు. ప్రారంభంలో జిన్నారోడ్డుకు చెందిన ఒక బుకీ వద్ద గుమాస్తాగా పని చేసేవాడు. తర్వాత అతని వద్దే సబ్ బుకీగా పని చేస్తూ నేడు రాయలసీమలోనే పేరు పొందిన క్రికెట్ బుకీగా మారాడు. సీమ జిల్లాల్లో అతనికి వందలాది మంది సబ్ బుకీలు ఉన్నారు. మ్యాచ్‌లు జరిగే సమయంలో వీరి నుంచి ప్రతి రోజు రూ.కోట్లలో టర్నోవర్ సదరు బెట్టింగ్ డాన్‌కు చేరుతుంది. అతను కొంత బెట్టింగ్ మొత్తాన్ని తనే ఉంచుకొని మిగతా టర్నోవర్‌ను ముంబైలోని సేట్‌లకు పంపిస్తుంటాడు. ఇలా చాలా ఏళ్ల నుంచి అతను బెట్టింగ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడు. ఏపీతో పాటు తెలంగాణా, ముంబై తదితర ప్రాంతాలకు చెందిన బడా బుకీలతో అతనికి సంబంధాలు ఉన్నాయి.

ప్రొద్దుటూరు నుంచే అధిక టర్నోవర్ ...

ప్రొద్దుటూరు క్రికెట్ బెట్టింగ్‌కు ప్రసిద్ధి. ఇక్కడ బడా బుకీలతో పాటు సబ్ బుకీలు అనేక మంది క్రికెట్ పందేలు నిర్వహిస్తున్నారు. వీరిలో ఈ డాన్‌కే టర్నోవర్ ఉన్న బుకీలే ఎక్కువ మంది ఉన్నారు. వీళ్లే గాక పందేల డబ్బులు వసూలు చేసేందుకు అనేక మంది యువకులు కొరియర్ బాయ్‌లుగా వీరి కింద పని చేస్తున్నారు. వీరికి బైక్‌తో పాటు మెయింటెనెన్స్ కోసం డబ్బు, ఖరీదైన సెల్‌ఫోన్, మందు ఆశ చూపడంతో అనేక మంది యువకులు వారికి తెలియకుండానే క్రికెట్ బెట్టింగ్ రొంపిలోకి దిగుతున్నారు. కాగా క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించి రాయలసీమలోని ఇతర జిల్లాలతో పోలిస్తే ప్రొద్దుటూరు నుంచే రూ. కోట్లలో టర్నోవర్ ఇతడికి వెళ్తుండడం విశేషం.

అనేక బెట్టింగ్ కేసులు

బెట్టింగ్ డాన్‌పై అనేక కేసులున్నాయి. హోమ్ స్టేషన్ అయిన ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అతనిపై సస్పెక్ట్ షీట్ ఉంది. ఇదే స్టేషన్‌లో 10కి పైగా బెట్టింగ్ కేసులు ఉన్నాయి. అలాగే టూ టౌన్, త్రీ టౌన్, ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అనేక క్రికెట్ బెట్టింగ్ కేసులు నమోదు అయ్యాయి. కడపలోని రెండు స్టేషన్లలో కేసులు ఉన్నాయి. అలాగే అనంతపురం జిల్లా, కర్నూలు జిల్లాలో కూడా కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఇటీవల ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసులు ముగ్గురు క్రికెట్ బుకీలను అరెస్ట్ చేశారు. ఈ కేసును లోతుగా దర్యాప్తు చేసిన వన్‌టౌన్ పోలీసులు సదరు బెట్టింగ్ డాన్ ప్రమేయం కూడా ఉందని నిర్ధారణ కావడంతో అతని పేరు కూడా కేసులో చేర్చారు. అలాగే ఇదే కేసులో నెల్లూరు, అనంతపురానికి చెందిన పలువురు ఉన్నట్లు తెలుస్తోంది.

రక్షణ కోసం టీడీపీలో చేరిక...

క్రికెట్ బెట్టింగ్‌లే ఆదాయ మార్గంగా ఎంచుకున్న సదరు 'బెట్టింగ్ డాన్' కుటుంబీకులు టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమక్షంలో మంగళవారం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో 25వ వార్డు కౌన్సిలర్ షేక్ మెహరూన్, ఆమె భర్త ఖాద్రి, బావ నూరి టీడీపీలో చేరారు. వీరంతా బెట్టింగ్ డాన్ రక్తసంబంధీకులు. ఖాద్రిపై కూడా క్రికెట్ బెట్టింగ్ కేసులు ఉన్నాయి. కేవలం అధికార పార్టీ అండకోసమే 'డాన్' కుటుంబ సభ్యులు టీడీపీలో చేరారని సమాచారం. తమ రాజకీయ జీవితంలో ఎక్కువ కాలం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వెంటే నడిచామని ఈ సందర్భంగా నూరి చెప్పడం గమనార్హం.

సొంతంగా యాప్‌ల నిర్వహణ



ప్రస్తుతం క్రికెట్ బెట్టింగ్‌లో యాప్‌ల హవా నడుస్తుండటంతో బుకీలు కూడా అప్‌డేట్ అయ్యారు. ప్రొద్దుటూరుకు చెందిన 'బెట్టింగ్ డాన్'తో పాటు పలువురు సొంతంగా యాప్‌లను నిర్వహిస్తున్నారు. మ్యాచ్‌ల సమయంలో యాప్‌ల నిర్వహణ కోసం రూ. లక్షలు వెచ్చించి ప్రత్యేకంగా టెక్నికల్ టీంలను ఏర్పాటు చేసుకున్నారు. ఐడీల ద్వారా స్థానికంగా ఉన్న బుకీలు యాప్‌ల ద్వారానే క్రికెట్ పందేలు నిర్వహిస్తున్నారు. బెంగళూరులో నివాసం ఉంటున్న అతను ఐపీఎల్ లాంటి వరుస క్రికెట్ మ్యాచ్‌లు ఉన్న సమయంలో సింగపూర్, కువైట్, దుబాయ్ దేశాల్లో ఉంటూ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తుంటాడు. ఒకే చోట ఉండకుండా 15–20 రోజులకు మకాం మారుస్తుంటాడు. ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో క్రికెట్ పందేలు జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

అన్ని వేళ్లూ వరద వైపే...

క్రికెట్ డాన్‌గా గుర్తింపు పొందిన సదరు బుకీ కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీలో చేర్చుకోవడంపై విమర్శకుల వేళ్లన్నీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వైపే చూపుతున్నాయి. తాము అధికారంలోకి వస్తే జూదం, క్రికెట్ బెట్టింగులను అంతం చేస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అదే వ్యక్తులను అధికార పార్టీలో చేర్చుకోవడం వెనుక మతలబు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రొద్దుటూరులో ఇప్పటికే యథేచ్ఛగా జూదం కొనసాగుతుంది. మరోవైపు క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు ఎమ్మెల్యే చెంతన ఉంటే అడ్డగించే సాహసం చేసేదెవరని పరిశీలకులు నిలదీస్తున్నారు.

న్యూస్‌రీల్

కేసీ కెనాల్ నీటి విడుదలకు చర్యలు

కడప సెవెన్‌రోడ్స్: కేసీ కెనాల్ ఆయకట్టుకు ఏప్రిల్ 15వ తేది వరకు నీరు అవసరమని జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీలో కోరడంతో ఆ విషయాన్ని తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని కేసీ కెనాల్ (స్పెషల్) సబ్ డివిజన్ మైదుకూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు తగు చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు తెలిపారని వెల్లడించారు. ఈనెల 22న సాక్షి దినపత్రికలో 'ఇటు కేసీ చూడండి' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. జిల్లాలోని కేసీ కాలువ పరిధిలో ఉన్న పంటలకు ఇప్పటివరకు నీరు అందిస్తూనే ఉన్నామని తెలిపారు. అలాగే మైలవరం నుంచి కూడా ఆయకట్టుకు నీరందించే అంశాన్ని మైలవరం జలాశయ ఇంజనీరింగ్ అధికారులను సంప్రదిస్తామని పేర్కొన్నారు.

సేవా దృక్పథం అలవరచుకోవాలి



మానసిక వికలాంగుల ఆశ్రమానికి నిత్యావసర సరుకులను అందిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

పులివెందుల రూరల్: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరచుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం తరఫున వేంపల్లెలోని అమ్మ ఆశ్రమం, లింగాల సమీపంలోని దీనబంధు మానసిక వికలాంగుల ఆశ్రమానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం అధ్యక్షుడు కె.రమేష్, కార్యదర్శి జి.నాగశేషారెడ్డి, కోశాధికారి ఎన్.నరసింహులు, వేంపల్లె సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా శనగల కొనుగోలు



కడప సెవెన్‌రోడ్స్: ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలో శనగ, మినుములు కొనుగోలు కోసం ఈనెల 19 నుంచి కేంద్రాలు ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతుల నుంచి శనగ క్వింటాలుకు రూ. 5650, మినుములు క్వింటాలుకు రూ.7400 చొప్పున కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ఈనెల 11 నుంచి సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్లకు అనుమతులు ఇచ్చామన్నారు. రైతులు ఇంకా ఎవరైనా తమ పేర్లు నమోదు చేసుకోకుంటే వెంటనే రైతు సేవా కేంద్రాల్లోకి వెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే శనగ, మినుములు కొనుగోలు చేస్తామన్నారు. పంట నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్నారు. జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, ముద్దనూరు, ఎర్రగుంట్ల, పెండ్లిమర్రి, పోరుమామిళ్ల, వీఎన్ పల్లె, వల్లూరు, ప్రొద్దుటూరు, రాజుపాలెం, పులివెందుల, వేంపల్లె, వేముల, సింహాద్రిపురం, తొండూరు, కమలాపురంలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగిసిన వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని దినసరి కూరగాయల మార్కెట్‌తో పాటు వాహనాల పార్కింగ్‌కు సంబంధించి కమిషనర్ మల్లికార్జున మంగళవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ నెల 22న నిర్వహించాల్సిన వేలం పాట వాయిదా పడటంతో మంగళవారం నిర్వహించారు. దినసరి కూరగాయల మార్కెట్, వాహనాల పార్కింగ్‌కు మున్సిపాలిటీ రూ.1.29 కోట్లతో వేలం పాట ప్రారంభించగా షేక్ ముత్యాలపాడు గౌస్ బాషా రూ.1,60,80,000 పాట దక్కించుకున్నారు. జీఎస్టీతో కలిపి సదరు వ్యాపారి రూ.1,92,96,000 చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే వేలం పాట రూ.1,33,75,415 పలికింది. అలాగే మాంసం, చేపల మార్కెట్‌కు సంబంధించి వేలం పాటను రూ.6,50,000 ప్రారంభించగా బి.నవీన్‌కుమార్ రెడ్డి రూ.6,66,000 పాటను దక్కించుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు వీరికి రుసుం వసూలు చేసుకునే హక్కు ఉంటుంది. రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలి

జెడ్పీ సీఈఓ ఓబులమ్మ



సీపీడబ్ల్యూ స్కీం పై ఆరా తీస్తున్న జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

కొండాపురం: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గండికోట జలాశయం వద్ద ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సీపీ డబ్ల్యూ స్కీం నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గండికోట జలాశయం నుంచి కొండాపురం మండలంలోని తొమ్మిది గ్రామాలకు వెళ్లే సీపీడబ్ల్యూ స్కీం ద్వారా తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ప్రస్తుతం నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా సీపీడబ్ల్యూ స్కీం పైపులైన్ డ్యామేజ్ కావడంతో ఆరు గ్రామాలకు తాగునీటి సౌకర్యం నిలిచిపోయిందని అధికారులు ఆమె దృష్టికి తీసికెళ్లారు. ప్రస్తుతం మండలంలోని కొండాపురం, గండ్లూరు, చౌటిపల్లె గ్రామాలకు ఈస్కీం నడుస్తున్నట్లు ఆమెకు వివరించారు. పునరావాస కేంద్రాలల్లో తాగునీటిసమస్య లేకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ నాగప్రసాద్ ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్, ఏఈ ప్రసాద్, శంకర్‌రెడ్డి,పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వైద్య సేవలు కొనసాగాయి

కడప రూరల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో పేదల వైద్యానికి ఎలాంటి ఆటంకం కలగలేదని ఆ సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ బాల ఆంజనేయులు తెలిపారు. కాగా ఎన్టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న వైద్య మిత్రలు సోమవారం విధులను బహిష్కరించి తమ సమస్యల పరిష్కారానికి నిరసనలు తెలిపిన విషయం విదితమే.

క్షయ వ్యాధిగ్రస్తులపై వివక్ష తగదు



జిల్లా అధికారులతో జాతీయ మానవ హక్కుల కమిషన్ కన్వీనర్ ప్రదీప్‌కుమార్

రాయచోటి అర్బన్: క్షయ వ్యాధిగ్రస్తులపై ఎవరూ వివక్ష చూపరాదని జాతీయ మానవ హక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, మానసిక ఆరోగ్యశాఖ, ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వర్చువల్‌గా రైల్వేకోడూరు జ్యోతికాలనీలో ఉన్న కుష్టు వ్యాధిగ్రస్తులతో మాట్లాడి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగ్గా కుష్టువ్యాధి నివారణ కార్యక్రమం అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ దేవసాగర్, డీఎంహెచ్ఓ కొండయ్య, అదనపు డీఎంహెచ్ఓ శైలజ, జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు

- తాళ్లపాక వైపు కన్నెత్తి చూడని టీటీడీ అధికారులు
- చైర్మన్‌కు ఫిర్యాదు చేసిన తాళ్లపాక గ్రామస్తులు



అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద స్వాగత తోరణాలు

రాజంపేట: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు 522 వర్ధంతి ఉత్సవాలను బుధవారం నుంచి నిర్వహించనున్నారు. టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. తాళ్లపాక, 108 అన్నమయ్య అడుగుల విగ్రహం వద్ద చలువ పందిళ్లు, స్వాగతతోరణాలు, కళాకారుల కోసం కళావేదికను సిద్ధం చేశారు. ఈ ఉత్సవాలు 29 వరకు కొనసాగనున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే ఆధ్యాత్మిక, సంగీత కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

తాళ్లపాకను అభివృద్ధి చేయాలి

తాళ్లపాక వైపు టీటీడీ అధికారులు కన్నెత్తి చూడటం లేదని తాళ్లపాక గ్రామస్తులు అదృష్టదీపుడు, మోహనరావు, నారాయణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగోతు రమేష్‌నాయుడులు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిశారు. తిరుమలలో హుండీలో వచ్చిన ఆదాయం ఒక శాతం తాళ్లపాక అభివృద్ధి కోసం వ్యయం చేయాలన్నారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల నేపథ్యంలో ఈ నెల 5న తాళ్లపాకకు వస్తానని, అభివృద్ధి చేసే అంశంపై చర్చిస్తానని చైర్మన్ హామీ ఇచ్చారని తెలిపారు.

భక్తకన్నప్ప గ్రామం..
ప్రాచుర్యం శూన్యం



భక్తకన్నప్ప విగ్రహం

భక్తకన్నప్ప జన్మస్థలికి ఇప్పటి వరకు అధికార ముద్ర పడలేదు. కూటమి ప్రభుత్వం అయినా చొరవ చూపుతుందా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. భక్తకన్నప్ప సినిమా తీస్తున్న మంచువిష్ణు బృందం సందర్శించిన క్రమంలో.. ఊటుకూరు మరోసారి తెరపైకి వచ్చింది.

- పెరియ పురాణం ద్వారా వెలుగులోకి జన్మస్థలి
- పట్టించుకోని ప్రభుత్వం
- కన్నెత్తి చూడని శ్రీకాళహస్తి దేవస్థానం
- భక్తుల ఆవేదన అరణ్య రోదన



ఊటుకూరులో కన్నప్ప ప్రతిష్టించిన శివలింగం ఉండే శివాలయం ఇదే



ఊటుకూరు శివాలయంలోని నాగలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న హీరో మంచు విష్ణు (ఫైల్)

రాజంపేట: భక్త కన్నప్ప గొప్ప శివభక్తుడు. తెలుగు వాడు. ఆయనను మొదట్లో తిన్నడు అనే పేరుతో పిలిచే వారు. బోయ వంశస్తుడు. ఒక బోయరాజు కుమారుడు.ఒకనాడు అడవిదారి గుండా వెళ్తుండగా.. శివలింగం కనిపించింది. అప్పటి నుంచి ఆ శివలింగాన్ని తిన్నడు భక్తి శ్రద్ధలతో పూజిస్తూ.. తాను వేటాడి తెచ్చిన మాంసాన్నే నైవేద్యంగా సమర్పించే వాడు. ఒక సారి శివుడు తిన్నడు భక్తిని పరీక్షించ దలచి.. ఆయన పూజ చేయడానికి వచ్చినపుడు శివలింగంలోని ఒక కంటి నుంచి రక్తం కార్చడం మొదలు పెట్టారు. విగ్రహం కంటిలో నుంచి నీరు కారడం భరించలేని తిన్నడు బాణపు మొనతో తన కంటిని తీసి విగ్రహానికి అమర్చాడు. వెంటనే విగ్రహం రెండో కంటి నుంచి కూడా రక్తం కారడం ఆరంభమైంది. కాలి బొటనవేలును గుర్తుగా ఉంచి తన రెండో కంటిని కూడా తీసి విగ్రహానికి అమర్చాడు. తిన్నడి నిష్కల్మష భక్తికి మెచ్చిన శివుడు అతనికి ముక్తిని ప్రసాదించారు. నిన్ను దర్శించినా, చరిత్ర విన్నా.. పఠించినా సర్వపాపాలు తొలిగి.. అంత్యకాలంలో కైలాసప్రాప్తి పొందుతారని పలికి పరమశివుడు అంతర్ధానమయ్యారు. అందువల్లనే తిన్నడికి.. కన్నప్ప అనే పేరు వచ్చింది. తిన్నడు దేవుడికి కన్ను ఇచ్చినందుకే కన్నప్ప అయ్యారు. ఆయన భక్తిని మెచ్చిన ప్రజలు.. భక్తకన్నప్పగా పిలుస్తున్నారు. ఆ శివలింగం ఉన్న ప్రాంతంలోనే శ్రీ కాళహస్తి క్షేత్రం వెలసినట్లు చరిత్ర చెబుతోంది.

కన్నప్ప పుట్టిన ఊరు ఎక్కడా..

రాజంపేట పట్టణం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో కడప–రేణిగుంట జాతీయ రహదరిలో భక్తకన్నప్ప జన్మస్థలం అయిన ఊటుకూరు ఉంది. హైవే రోడ్డు పక్కనే కన్నప్ప ప్రతిష్ఠించిన శివలింగం ఉన్న పురాతన ఆలయం ఉంది. తిరుపతి, చెన్నైకు వెళ్లే ఏ వాహనంలో అయినా ఊటుకూరు (ఉడుమూరు)కు చేరుకోవచ్చు.

వెలుగులోకి తీసుకొచ్చిన తమిళ వాసి..

తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన పళనిస్వామి పెరియపురాణం ద్వారా భక్తకన్నప్ప జన్మస్థలం.. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట మండలం ఊటుకూరు అని వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి విదితమే. అప్పటి నుంచి గ్రామస్తులు దాతల సహకారంతో.. గ్రామంలోని శివాలయం అభివృద్ధికి నడుంబిగించారు. భక్తకన్నప్ప విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

అధికారిక గుర్తింపు కోసం ఎదురు చూపులు

భక్తకన్నప్ప జన్మస్థలం అధికారిక గుర్తింపు కోసం ఎదురు చూస్తోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనమతులు ఎప్పుడు వస్తాయని ఇక్కడి ప్రాంతీయులు వేచి చూస్తున్నారు. భక్తకన్నప్ప జన్మస్థలం అభివృద్ధికి సహకరించాలని గతంలో శ్రీకాళహస్తి దేవస్థానం దృష్టికి వారు తీసుకెళ్లారు.

కన్నప్ప.. కాళహస్తికి ఎలా వెళ్లాడు



తిన్నడు(కన్నప్ప) ఒకనాడు అడవిలో పందిని వేటాడుతూ ఊటుకూరు నుంచి అటవీ ప్రాంతంలో స్వర్ణముఖినది వరకు వెళ్లాడు. అక్కడ నేటి శ్రీకాళహస్తి దగ్గర శివలింగాన్ని దర్శించి, శివుని భక్తునిగా మారారు. తర్వాత తన రెండు కళ్లను సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఆనాటి నుంచి శ్రీకాళహస్తిలో భక్తకన్నప్పకు.. స్వామివారి కన్న ముందే పూజ చేయడం ఆచారంగా వస్తోంది. ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాల సమయంలోనూ.. భక్తకన్నప్ప కొండపై తొలుత ధ్వజారోహణం చేసిన తర్వాత మరుసటి రోజు స్వామివారి ధ్వజారోహణ చేసి ఉత్సవాలు ప్రారంభిస్తారు.

కన్నప్ప జన్మస్థలం ఇలా..

అరవై ముగ్గురు మహాశివభక్తులలో కన్నప్ప ఒకరు. తండ్రి నాగుడు, తల్లి తంచె. కన్నప్ప ద్వాపరయుగంలో అర్జునడే. ఆ యుగంలో శివుని అనుగ్రహం కోసం తపస్సు చేసి.. పాశుపతాస్త్రం పొందారు. కలియుగంలో తిన్నడు (కన్నప్ప)గా ఉడుమూరులో జన్మించారు. కాలక్రమంలో ఉడుమూరు ఊటుకూరుగా మారింది. కన్నప్ప ప్రతిష్టించిన శివలింగం.. తన జన్మస్థలమైన ఊటుకూరులో ఉంది. అక్కడ శివాలయం వెలసింది.

అన్నమయ్యతో కన్నప్ప జన్మస్థలానికి అనుబంధం



తాళ్లపాక అన్నమాచార్యులు తాత నారాయణయ్య చదువుకోవడానికి ఊటుకూరు(ఉడుమూరు)కు వచ్చారు. చదువు అబ్బక గురువు పెట్టే శిక్షలు భరించలేక చింతాలమ్మ గుడిలోని పుట్టలో చేయిపెట్టారు. పాము కరవలేదు కానీ, చింతాలమ్మ ప్రత్యక్షమైంది. 'శ్రీ వెంకటేశ్వరుని అనుగ్రహం వల్ల పరమభక్తుడు నీకు మనవునిగా పుడతారు' అని ఆశీర్వదించింది. ఆ నారాయణయ్య మనువడే అన్నమాచార్యులు. అన్నమయ్య తండ్రి నారాయణసూరి, తల్లి లక్కమాంబ. అన్నమయ్య కూడా ఊటుకూరులో చిన్నతనంలో విద్యాభ్యాస్యం చేశాడు. కలియుగ దైవం వెంకటేశ్వరునిపై 32 వేల కీర్తనలు రచించి, పద కవితా పితామహుడుపేరు తెచ్చుకొని ధన్యుడయ్యారు. చింతాలమ్మ అమ్మవారి విగ్రహం ఇప్పటికీ ఊటుకూరు శివాలయంలో ఉంది.

భక్తకన్నప్ప నడయాడిన ప్రదేశం



గామంలో కన్నప్ప పూజించిన శివాలయం ఉంది. అలాగే ఊటుకూరు పరిసరాలు కన్నప్ప నడయాడిన ప్రాంతాలు. భక్తకన్నప్పకు శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల్లో తొలిపూజ అనే సంప్రదాయం తరతరాలుగా వస్తోంది.

–నాగా పృథ్వీపతిరెడ్డి, గ్రామపెద్ద, ఊటుకూరు

చారిత్రక ఆధారాలు ఉన్నాయి



కన్నప్ప ఇక్కడి వాడేనని అన్ని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి శ్రీకాళహస్తికి అటవీ మార్గంలో చేరుకున్నారు. శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల్లో తొలిపూజ మా గ్రామానికి చెందిన భక్తకన్నప్పకు అంటే మాలో ఎక్కడ లేని భక్తి ఉప్పొంగి వస్తుంది.

–ఆర్.శ్రీనువాసురాజు, ఎంపీటీసీ, ఊటుకూరు

అనుమానంతో భార్యను హతమార్చిన భర్త

- ఆపై తానూ ఆత్మహత్య
- వైఎస్సార్ జిల్లాలో ఘటన


సుజాత మృతదేహం


చెన్న కేశవ మృతదేహం


సుజాత (ఫైల్)


చెన్న కేశవ (ఫైల్)

వల్లూరు : మద్యం మత్తులో అనుమానంతో భర్తే భార్యను హత్య చేసి ఆపై తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వల్లూరు మండల పరిధిలోని అంబవరం ఎస్సీ కాలనీలో మంగళవా రం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..అంబవరం ఎస్సీ కాలనీలో యర్రగుడిపాడుకు చెందిన చెన్న కేశవ, సుజాత దంపతులు నివసిస్తున్నారు. వీరికి సంతోష్ కుమార్ అనే వివాహమైన కుమారుడితో బాటు వరుణ్ కుమార్ (13) అనే కుమారుడు, స్వర్ణలత (8) అనే కుమార్తె ఉంది. చెన్న కేశవ (45) తాగుడుకు బానిసగా మారి మద్యం మత్తులో భార్య సుజాత (40)ను వేధిస్తుండేవాడు. సుజాతపై చెన్నకేశవ అనుమానం పెంచుకోవడంతో ఆమె 2 నెలల క్రితం తన పుట్టింటికి వెళ్లిపోయింది. నెల క్రితం ఆమె పెద్ద కుమారుని వివాహం జరగడంతో దాని కోసం ఆమె అంబవరం వచ్చింది. వివాహం జరిగిన తరువాత మళ్లీ తన అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. కొడుకు అత్తగారి ఇంటి నుంచి కోడలికి ఉగాది సాంగ్యం తెస్తుండటంతో..తన కుమారుడు ఆమెను అంబవరానికి తీసుకువచ్చాడు. మంగళవారం మద్యం తాగిన చెన్న కేశవ ఇంటి ఆవరణలో సుజాతపై కొడవలితో దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. చెన్న కేశవ కొడవలి పట్టుకుని క్రిష్టాపురం, గంగాయపల్లె రైల్వేస్టేషన్ల మధ్య నల్లపురెడ్డిపల్లె రైల్వే గేటుకు కొద్ది దూరంలో గూడ్సు రైలు కింద ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

దంపతుల మృతికి కారకుడిని ఎలా వదిలేస్తారు?


గ్రామస్తులకు మద్దతు ప్రకటిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి


నిరసనకారులతో నిండిపోయిన కలమల్ల స్టేషన్ ఆవరణం

- రోడ్డు ప్రమాదం ఘటనలో నిందితుడిని విడిపించుకుని వెళ్లిన కూటమి నాయకుడు
- కలమల్ల ఎస్ఐ తీరుపై గ్రామస్తుల మండిపాటు
- పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించి నిరసన
- గ్రామస్తులకు మద్దతు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : దంపతుల మృతికి కారణమైన ఓమ్నీ వాహన డ్రైవర్‌ను పోలీసులు వదిలి పెట్టడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున గ్రామస్తులు కలమల్ల పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వివరాలు ఇలా.. కలమల్ల గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం ఓమ్నీ వాహనం ఢీకొన్న సంఘటనలో వెంకటరాజారెడ్డి అనే ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు దుర్మరణం చెందగా అతని భార్య సుజాత తీవ్ర గాయాలతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ప్రమాదానికి కారణమైన ఓమ్నీ వాహన డ్రైవర్ వెంకటరమణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే రాత్రికి రాత్రే నిందితుడిని కూటమి పార్టీకి చెందిన ఆర్టీపీపీ ఉద్యోగి నారాయణస్వామి వచ్చి స్టేషన్ నుంచి విడిపించుకుని తీసుకెళ్లారు. ఇద్దరి మృతికి కారణమైన వాహన డ్రైవర్‌ను కలమల్ల ఎస్ఐ తిమోతి కూటమి నాయకుడి వెంట పంపించడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం కలమల్ల పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్ఐను కోరితే ఆయన తమను బెదిరించాడంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎస్ఐ తీరు ముందు నుంచి వివాదాస్పదంగా ఉందని, ఎవరు డబ్బులు ఇస్తే వారికి ఎస్ఐ వత్తాసు పలుకుతాడని ఆరోపించారు. గ్రామస్తులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం .సుధీర్‌రెడ్డి పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని గ్రామస్తులకు సంఘీభావం ప్రకటించారు. నిందితుడిని ఎలా వదిలేస్తారంటూ ఆయన మండిపడ్డారు. మృతుల కుటుంబానికి న్యాయం జరగకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న దంపతుల మృతదేహాలను సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాకు న్యాయం చేయండి..

తల్లిదండ్రులను పోగొట్టుకున్న ఇద్దరు కుమార్తెలు తీవ్ర వేదనతో స్టేషన్ బయట బైఠాయించారు. తమకు న్యాయం చేయండి అంటూ బోరున విలపించారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన తమకు దిక్కు ఎవరు అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఒకానొక దశలో గ్రామస్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేయడంతో స్టేషన్ ఆవరణంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిందితుడు వెంకటరమణ, అతన్ని విడిపించుకుని వెళ్లిన ఆర్టీపీపీ ఉద్యోగి నారాయణస్వామిపై చర్యలు తీసుకోవాలని మృతుల సమీప బంధువు లింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు.

కలమల్లకు చేరుకున్న పోలీసు బలగాలు..

ఎస్ఐ తీరును నిరసిస్తూ కలమల్ల గ్రామస్తులు స్టేషన్ బయట బైఠాయించడంతో ఎస్ఐ తిమోతి స్టేషన్‌లోనే ఉండిపోయారు. వెంటనే కొండాపురం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నుంచి సీఐలు మహమ్మద్ రఫీ, లింగప్ప, నరేష్‌బాబు, గోవిందరెడ్డి, గోపాల్‌రెడ్డి, దస్తగిరిలు, ఎస్ఐలు విద్యాసాగర్, ధనుంజయుడు, హృషికేశవరెడ్డి, పోలీసు సిబ్బంది స్టేషన్ వద్దకు చేరుకున్నారు. పరిస్థితి అదుపు చేసేందుకు ప్రయత్నించారు. తర్వాత జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లు కూడా స్టేషన్‌కు వచ్చి పరిస్థితిని సమీక్షించారు.

కారు ఢీకొని తీవ్ర గాయాలు

చాపాడు : చాపాడులోని నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతిరెడ్డి నాగ యశ్వంత్‌రెడ్డి అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం దిగువపల్లెకు చెందిన రాధాకృష్ణారెడ్డి కుమారుడు నాగ యశ్వంత్‌రెడ్డి పల్లవోలు వద్ద గల సీబీఐటీ కాలేజీలో డిప్లమో చదువుతున్నాడు. మంగళవారం ప్రొద్దుటూరు నుంచి చాపాడుకు వచ్చి కూడలిలో యూటర్న్ తీసుకుంటుండగా కారు ఢీకొని గాయపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


టిప్పర్ డ్రైవర్ కోర్న సూర్యనారాయణ (ఫైల్)

చింతకొమ్మదిన్నె : కడప-చిత్తూరు జాతీయ రహదారిపై మండల పరిధిలోని మద్దిమడుగు బిడికి గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేకల ఆదినారాయణ, కోర్న సూర్యనారాయణ అనే వ్యక్తులు మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున రాయచోటి నుంచి కడపకు రాతి స్తంభాలు వేసుకుని ఏపీ04 బీఎక్స్7660 నెంబర్ గల ట్రాక్టరులో డ్రైవర్ వెంకట చలపతి, సహాయకుడు మేకల ఆదినారాయణ వస్తుండగా మద్దిమడుగు సుగాలి బిడికి గ్రామ సమీపంలో ఉదయం 5.45 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ట్రాక్టర్ ట్రాలీ వెనుక ఎడమవైపు గల టైరు పేలి ట్రాక్టర్ అదుపు తప్పింది. ఈ ఘటనతో ట్రాక్టర్ ఒక్కసారిగా వేగం తగ్గడంతో వెనుక ఏపీ05 టీడీ 6549 నెంబరుగల కంకర లోడుతో వస్తున్న టిప్పర్ డ్రైవర్ వేగాన్ని అదుపు చేసుకోలేక ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకట చలపతి, టిప్పర్ డ్రైవర్ కోర్న సూర్యనారాయణ, ట్రాక్టర్ సహాయకుడు ఆదినారాయణను రోడ్డు పక్కకు తీసుకెళ్లి నీరు తాగిస్తుండగా కొద్దిసేపటికే ఎన్ఎల్02 బి 7879 నెంబరుగల శివాజీ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు డ్రైవర్ తురక శివరామకృష్ణ కడప నుంచి రాయచోటి వైపు అతివేగంగా నడుపుకుంటూ వచ్చి టిప్పర్ డ్రైవర్ కోన సూర్యనారాయణను ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ట్రాక్టర్‌లోని సహాయకుడు, టిప్పర్ డ్రైవర్‌ను రిమ్స్‌కు తరలించారు. ఉదయం 7.36 గంటలకు ట్రాక్టర్ సహాయకుడు మేకల ఆదినారాయణ, ఉదయం 9.11 గంటలకు టిప్పర్ డ్రైవర్ కోర్న సూర్యనారాయణ మృతి చెందారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు చింతకొమ్మదిన్నె సీఐ తెలిపారు.

బేకరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్


షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన సామగ్రి

వేంపల్లె : స్థానిక వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలోని కడప రోడ్డులో ఉన్న బెంగళూరు బేకరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీంతో స్వీట్లకు సంబంధించిన మెటీరియల్, మిషనరీ దగ్ధమైంది. సంతోష్ కుమార్ అనే వ్యక్తి బతుకు దెరువు కోసం వృషభాచలేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన వాణిజ్య గదుల్లో బెంగళూరు బేకరీని నిర్వహిస్తున్నారు. రోజూ లాగే షాపునకు బీగాలు వేసి ఇంటికి వెళ్లారు. అయితే మంగళవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో బేకరీలో నుంచి దట్టమైన పొగలు రావడంతో సమీపంలో ఉన్న దుకాణదారుడు నాగ సుబ్బారావు చూసి బేకరీ యాజమాని సంతోష్ కుమార్ కు సమాచారమిచ్చారు. అలాగే అగ్నిమాపక శాఖకు ఫోన్ ద్వారా సమాచారమివ్వడంతో హుటాహుటిన అగ్నిమాపక శాఖాధికారి శివరామిరెడ్డి సంఘటన స్థలం వద్దకు తన సిబ్బందితో చేరుకుని మంటలను అదుపు చేశారు. బేకరీలోనే స్వీట్లు తయారీ చేస్తుండడంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వచ్చినట్లు ఫైర్ అధికారి తెలిపారు. అగ్ని ప్రమాదం కారణంగా దాదాపు రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

డ్రైవర్‌పై దాడి చేసి.. కారును దొంగిలించారు

- ఇద్దరి అరెస్టు.. నిందితుల్లో ఒకరు మైనర్
- పరారీలో ఇరువురు ప్రధాన నిందితులు
- వివరాలు వెల్లడించిన కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు


అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్ : హైదరాబాదు నుంచి కడపకు ఇన్నోవా కారును బాడుగకు తీసుకుని వచ్చి డ్రైవర్‌పై దాడి చేసి.. కారును దొంగిలించిన కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మైనర్ బాలుడు ఉన్నాడు. మంగళవారం కడప డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు చిన్న చౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐలు రాజరాజేశ్వర్ రెడ్డి, రవికుమార్‌లతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన నూరుల్లా అలియాస్ నూర్, తాజుద్దీన్ అలియాస్ తాజ్ హైదరాబాదుకు వెళ్లి ఈనెల 15న రాత్రి ఇన్నోవా కారును కడపకు బాడుగకు మాట్లాడుకొని వచ్చారు. ఈనెల 16వ తేదీన కడప రింగ్ రోడ్డు వద్దకు రాగానే కారు డ్రైవర్‌పై దాడి చేసి అతని మెడలోని బంగారు గొలుసు, వెండి ఉంగరాలను దోచుకుని కారుతో నిందితులు పరారయ్యారు. కారు డ్రైవర్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కడప చిన్నచౌక్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల దర్యాప్తులో కడపకు చెందిన పఠాన్ మర్ఫాద్ ఖాన్ అలియాస్ హోంవర్కర్ అలియాస్ లడ్డు మరో బాల నేరస్తునితో కలిసి డ్రైవర్ శ్రీకాంత్‌ను కొట్టి అతని వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, మెడలో ఉన్న బంగారు గొలుసు, వెండి ఉంగరాలు తీసుకొని కారుతో పరారైనట్లు గుర్తించారు. జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులపై నిఘా ఉంచారు. వాటర్ గండి రోడ్డులో కడప నకాష్‌కు చెందిన పఠాన్ మర్ఫాద్ ఖాన్ అలియాస్ హోంవర్కర్ అలియాస్ లడ్డును అరెస్ట్ చేశారు. మరో మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు నూరుల్లా అలియాస్ నూర్, తాజుద్దీన్ అలియాస్ తాజ్‌లు పరారీలో ఉన్నారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు ఒకరిని రిమాండ్‌కు తరలించారు. మరొకరిని పరిశీలనకు పంపించారు.

పది ప్రశ్నపత్రం లీకేజీపై విచారణ

సాక్షిటాస్క్‌ఫోర్స్ : వల్లూరు జెడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రం నుంచి సోమవారం పదో తరగతి గణితం ప్రశ్నపత్రం లీకేజీ ఘటనపై విచారణ కొనసాగుతోంది. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో, కమలాపురం సీఐ ఎస్కే రోషన్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డిల నేతృత్వంలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం రాత్రి వరకు అత్యంత రహస్యంగా విచారణ జరిపారు. ఇప్పటికే వల్లూరు జెడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలోని చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ అధికారితో పాటు ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పరీక్షా కేంద్రంలో విద్యా శాఖకు సంబంధం లేని బయటి వ్యక్తిని వాటర్‌బాయ్‌గా నియమించడం వెనుక ఆంతర్యం ఏమిటనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. అతని ద్వారానే ప్రశ్నప్రతం బయటకు వచ్చిందనే ఆరోపణలున్నాయి. అలాగే పలువురు ఇన్విజిలేటర్లు, సిబ్బంది సెల్‌ఫోన్లు కూడా లోనికి దర్జాగా తీసుకెళ్లారంటే పరీక్షల నిర్వహణ ఎంత లోపభూయిష్ఠంగా ఉందో తెలుస్తోంది. ఈ అన్ని అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.



స్త్రీలను కొన్ని ఉపాధుల్లోకి రానీకుండా అడ్డుకుంటారు. అడ్డుకునేవారిని అడ్డుకుంటాం అంటున్నారు ఈ లేడీ బౌన్సర్లు. కొచ్చి, పూణె, ఢిల్లీ, ముంబైలలో లేడీ బౌన్సర్లకు గిరాకీ పెరిగింది. సెలబ్రిటీలను గుంపు నుంచి అడ్డుకుని వీరు కాపాడుతారు. స్పోర్ట్స్, మార్షల్ ఆర్ట్స్, బాడీ బిల్డింగ్ తెలిసిన స్త్రీలు ఈ రంగాన్ని ఎంచుకుంటున్నారు. రోజుకు రెండు వేల వరకూ ఫీజు. వివాహితలూ ఉన్నారు. వివరాలు...

లేడీ బౌన్సర్స్‌కు
అడ్డే లేదు

ఎనిమిది గంటలు డ్యూటీ. తీసుకెళ్లడం తీసుకు రావడం ఏజెన్సీ పని. భోజనం ఉంటుంది. బయట ఊర్లయితే రూము కూడా ఇస్తారు. రోజుకు రెండు వేల నుంచి రెండు వేల ఐదు వందలు సంపాదన. చేయాల్సిన పని?

- క్రౌడ్‌ను కంట్రోల్ చేయడం
- ఈవెంట్ సెక్యూరిటీ
- సెలబ్రిటీల రక్షణ
- సెలబ్రిటీలను ఎయిర్‌పోర్ట్ నుంచి రిసీవ్ చేసుకోవడం
- సంపన్నుల వేడుకల్లో హంగామా కోసం
- ప్రయివేటు సమస్యల్లో రక్షణ

ఇటీవల ఒక సినీ నటుడి ఇంటి గొడవల్లో బౌన్సర్లనే మాట ఎక్కువగా వినిపించింది. పోలీసుల రక్షణ వీలుగాని చోట ప్రముఖులు బౌన్సర్ల సాయం తీసుకోవడం సాధారణం అయ్యింది. ఒకప్పుడు పబ్‌లలో తాగి గొడవ చేసే వారి కోసం మాత్రమే బౌన్సర్లు ఉండేవారు. ఇప్పుడు అన్ని సేవలకు వారిని ఉపయోగిస్తున్నారు. సెక్యూరిటీకి మాత్రమే కాదు దర్పం చూపించడానికి కూడా శ్రీమంతులు బౌన్సర్లను వాడుతున్నారు. ఉదాహరణకు కలవారి పెళ్లిళ్లలో వరుడు/వధువు కల్యాణ వేదికకు వచ్చేప్పుడు వరుసదీరిన బౌన్సర్లు చెరో పక్క నడుస్తూ బిల్డప్ ఇస్తున్నారు. చూసేవారికి ఇది గొప్పగా ఉంటుంది. వేడుకలకు, బిజినెస్ మీటింగ్స్‌కు వచ్చే అతిథుల కోసం ఎయిర్‌పోర్ట్‌కు బౌన్సర్లను పంపుతున్నారు. కాలేజీ వేడుకలు, ప్రారంభోత్సవాలు, ఔట్‌డోర్ షూటింగ్‌లు... వీటన్నింటికీ బౌన్సర్లు కావాలి. ఎంతమంది బౌన్సర్లుంటే అంత గొప్ప అనే స్థితికి సెలబ్రిటీలు వెళ్లారు. దాంతో వీరి సేవలను సమకూర్చే ఏజెన్సీలు నగరాల్లో పెరిగాయి. మహిళా బౌన్సర్లు కూడా పెరిగారు.



ఇబ్బందిగా మొదలయ్యి...

'మొదట ప్యాంటూ షర్టు వేసుకున్నప్పుడు ఇబ్బందిగా అనిపించింది. ఇంట్లో వాళ్లు కొత్తగా చూశారు. ఇరుగుపొరుగు వారు వింతగా చూశారు. కాని తరువాత అలవాటైపోయింది' అంది పూణెకు చెందిన ఒక మహిళా బౌన్సర్. 2016లో దేశంలోనే మొదటిసారిగా మహిళా బౌన్సర్ల ఏజెన్సీ ఇక్కడ మొదలైంది. ఆ తర్వాత ఢిల్లీ, ముంబై, బెంగళూరులలో ఇలాంటివి వచ్చాయి. ఇప్పుడు కేరళలో ఈ రంగంలోకి వస్తున్నవారు పెరిగారు. 'మేము ఎవరినో రక్షించడానికి వెళుతుంటే మా రక్షణ కోసం కొత్తల్లో కుటుంబ సభ్యులు ఆందోళన పడేవారు. కాని స్త్రీలు ఈ రంగంలో సురక్షితంగా పని చేయొచ్చని నెమ్మదిగా అర్థం చేసుకున్నారు' అని మరో బౌన్సర్ అంది.

రెండు విధాలా ఆదాయం

కొచ్చిలో 'షీల్డ్ బౌన్సర్స్ ఏజెన్సీ'కి చెందిన మహిళా బౌన్సర్లు వేడుకలకు ప్రధాన ఆకర్షణగా మారారు. ఈవెంట్స్‌లో మహిళా అతిథులకు, స్టేజ్ రక్షణకు, అతిథుల హోటల్ నుంచి ఈవెంట్ వద్దకు తీసుకు రావడానికి వీరి సేవలు ఉపయోగిస్తున్నారు. 'సాధారణంగా ఈవెంట్స్ సాయంత్రాలు ఉంటాయి. బౌన్సర్ల పని అప్పటి నుంచి మొదలయ్యి అర్ధరాత్రి వరకూ సాగుతుంది. కాబట్టి పగటి పూట చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ లేదా ఇంటి పనులు చక్కబెట్టుకుంటూ మధ్యాహ్నం తర్వాత ఈ పని చేస్తున్నవారూ ఉన్నారు. దాంతో రెండు విధాల ఆదాయం ఉంటోంది' అని ఆ ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపాడు.

స్పోర్ట్స్ తెలిసినవారు

స్కూల్, కాలేజీల్లో స్పోర్ట్స్‌లో చురుగ్గా ఉన్న మహిళలు, వ్యాయామం ద్వారా జిమ్ ద్వారా దేహాన్ని ఫిట్‌గా ఉంచుకున్నవారు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్న వారు మహిళా బౌన్సర్లుగా రాణిస్తారు. వెంటనే వారికి పని దొరికే పరిస్థితి ఉంది. దేశంలోని నగరాల్లో వివాహితలు, పిల్లలున్న తల్లులు కూడా వృత్తిలో రాణిస్తున్నారు. 'జనాన్ని అదుపు చేయడం, వారిని ఒప్పించి ఇప్పుడే దూరంగా జరపడం, ఆకతాయిలను కనిపెట్టడం, సెలబ్రిటీలతో వ్యవహరించే పద్ధతి తెలియడం, చట్ట పరిధిలో గొడవలను అదుపు చేయడం తెలిస్తే ఈ వృత్తి లాభదాయకం' అంటున్నారు ఈ మహిళా బౌన్సర్లు.

బ్యూటిప్

మొటిమలు, మచ్చలు పోవాలంటే...



ముఖంపై మృతకణాలను ఎప్పటికప్పుడు తొలగించుకోకుంటే మొటిమలు, మచ్చలు లాంటి సమస్యలు తలెత్తుతాయి. అలా కాకుండా ఉండాలంటే ఇంట్లో ఆరోగ్యకరమైన స్క్రబ్‌ను తయారు చేసుకోవచ్చు. అందుకు మూడు టీస్పూన్ల బేకింగ్ సోడాలో ఒక టీస్పూన్ ఓట్స్ వేసి కొన్ని నీళ్లతో మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. రోజూ ఆఫీసు నుంచి ఇంటికి రాగానే ఈ మిశ్రమంతో ముఖాన్ని స్క్రబ్ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



వియ్ హబ్ బ్రాండ్ అంబాసిడర్
వంట గెలిచింది

ఆమె... వంటతో జీవితాన్ని నిలబెట్టుకుంటానని, వంటలతో అవార్డులు అందుకుంటానని, వియ్ హబ్ (విమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్)కి బ్రాండ్ అంబాసిడర్ అవుతానని కలలో కూడా కలగనలేదు. పాలతో కూరలు వండే గుజరాత్ వాళ్లు ఆమె చేసిన పుదీనా పచ్చడిని లొట్టలేసుకుంటూ తిన్నారు. కొబ్బరి, అరటితో మసాలాలు లేని తేలిక ఆహారం తీసుకునే కేరళ వాసులు కూడా ఆమె చేతి రుచికి ఫిదా అయ్యారు. గోవా వాళ్లకు చేపలతో కొత్త వంటలను పరిచయం చేశారామె. ఈ విజయాలన్నీ ఆమెను రాష్ట్ర సెక్రటేరియట్ వైపు నడిపించాయి. తెలంగాణ సెక్రటేరియట్‌లో క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఆమె పేరు ఆకుల కృష్ణకుమారి. ఊరు మేడ్చల్ – మల్కాజ్‌గిరి జిల్లా, మూడు చింతలపల్లి గ్రామం. నెలకు లక్షకు పైగా ఆర్జిస్తున్న కృష్ణకుమారి జీవితం పలువురికి స్ఫూర్తిదాయకం.



కృష్ణకుమారి

కృష్ణకుమారి గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత ఒక ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా ఉద్యోగం చేశారు. ఆ తర్వాత కొంతకాలం ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఫ్రంట్ ఆఫీసర్. తనకు వంటలు చేయడం, వంటల్లో ప్రయోగాలు చేయడం ఇష్టం. ఆ ఇష్టంతో తాను చేసిన కొత్త వంటకాలను కొలీగ్స్‌కి ఇచ్చేవారామె. ''మా నాన్న టైలర్. ఓ రోజు సెర్ప్ (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) డీపీఎమ్ సురేఖ గారు మా షాప్‌కి వచ్చారు. నన్ను చూసి నేను చేస్తున్న పని తెలిసిన తర్వాత ఆమె నాకో డైరెక్షన్ ఇచ్చారు. ఆ ధైర్యంతోనే నా కుటీర పరిశ్రమ మొదలైంది. తొలి ఆర్డర్ యూఎస్‌కి, డాక్టర్ గీతాంజలి మేడమ్ పది వేల రూపాయల ఆర్డర్ ఇచ్చారు. అలా మొదలైన నా జర్నీ ఇప్పుడు నెలకు లక్ష రూపాయలకు పైగా ఆదాయంతో విజయవంతంగా సాగుతోంది. మిల్లెట్స్‌తో ప్రయోగాలు నన్ను నిలబెట్టాయి.'' అన్నారు కృష్ణకుమారి.



మహిళాశక్తి క్యాంటీన్

డ్వాక్రా స్వయంసహాయక బృందంలో చేరిన తర్వాత తన కార్యకలాపాలను వేగవంతం చేశారు కృష్ణకుమారి. హైదరాబాద్, రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఎన్ఐఆర్‌డీలో శిక్షణ తీసుకోవడంతో పాటు, తన ఉత్పత్తులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ వంటి ప్రక్రియలన్నీ పూర్తి చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఎగ్జిబిషన్‌లలో స్టాల్ పెట్టడంతో మొదలైన ఆమె జర్నీ సరస్ మేళా ఎగ్జిబిషన్‌లతో అండమాన్, కశ్మీర్ మినహా దేశమంతటికీ విస్తరించింది. ఆమె విజయపథం... ఎగ్జిబిషన్‌లో స్టాల్ కోసం అధికారులను అడగాల్సిన దశ నుంచి ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో స్టాల్ పెట్టవలసిందిగా కలెక్టర్ ఆఫీస్ నుంచి ఫోన్ కాల్ వచ్చే దశకు చేరింది.

చిన్న రైతులే





నా ఉత్పత్తులకు స్వాద్ అనే బ్రాండ్‌నేమ్ రిజిస్టర్ చేశాను. పరిశ్రమ దమ్మాయిగూడలో ఉంది. ఆరుగురు మహిళలు పని చేస్తున్నారు. నేను ఉదయం తొమ్మిదిన్నరకు సెక్రటేరియట్‌కు చేరుకుంటాను. తిరిగి ఇంటికి చేరేటప్పటికి రాత్రి పదవుతుంది. యూనిట్‌లో నిన్న తయారైన మెటీరియల్‌ను ఈ రోజున కౌంటర్‌లో పెడతాను. ఏ రోజుకారోజు అమ్ముడైపోతాయి. సెక్రటేరియట్ క్యాంటీన్‌తోపాటు యూనిట్‌లోనే అవుట్‌లెట్ కూడా ఉంది. రాపిడో ద్వారా సప్లయ్ చేస్తున్నాం. వినియోగదారులు మా దగ్గరకు రావడం కంటే మేమే వినియోగదారుల దగ్గరకు వెళ్లాలనే ఉద్దేశంతో మొబైల్ యూనిట్ ప్రారంభించనున్నాను. నా సక్సెస్‌కి కారణం తోటలే. పచ్చళ్లు, పొడులు ఏవి చేయాలన్నా కూరగాయలు మార్కెట్ నుంచి తెచ్చుకోను. నేరుగా తోటలకే వెళ్లి తెచ్చుకుంటాను. భారీ స్థాయిలో పండించే వాళ్లు స్వయంగా మార్కెట్‌కు తరలించగలుగుతారు. చిన్న రైతులు తమకు తాముగా మార్కెట్‌కి తీసుకెళ్లాలంటే ఆ ఖర్చులు భరించలేరు. నేను వారి దగ్గర తీసుకుంటాను. నేను ఇష్టంతో ఎంచుకున్న ప్రొఫెషన్. నాకు ఉపాధినివ్వడంతోపాటు గుర్తింపును కూడా తెచ్చింది. ఇందులోనే భవిష్యత్తును నిర్మించుకుంటాను. మహిళల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు మహిళలకు తెలియడం లేదు. ప్రభుత్వ పథకాల గురించి మహిళలకు అవగాహన కల్పించడం కోసం పని చేస్తాను.

– ఆకుల కృష్ణకుమారి, స్వాద్ ఫుడ్స్

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గత ఏడాది జూన్ నెల రెండవ తేదీన జరిగిన వేడుకల్లో ఆమె స్టాల్ పెట్టారు. ఆ స్టాల్‌లోని ఉత్పత్తులను ఆసాంతం పరిశీలించిన మంత్రులు, ముఖ్యమంత్రి ఆమె అక్కడికక్కడే లైవ్ కౌంటర్‌లో వండిన తెలంగాణ రుచులకు కూడా సంతృప్తి చెందారు. డ్వాక్రా మహిళల కోసం శాశ్వతంగా ఒక వేదికను ఏర్పాటు చేయవలసిందిగా కోరడంతో 'సెక్రటేరియట్ క్యాంటీన్ మహిళలకే ఇద్దాం' అని నోటిమాటగా వచ్చిన ఉత్తర్వుతో అదే నెల 21న ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ మొదలైంది. అందులో కృష్ణకుమారితో పాటు పదిమంది మహిళలు తమ ఉత్పత్తులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. జయహో మహిళాశక్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

లీగల్

పెళ్లి సంగతి తర్వాత... కౌన్సెలింగ్ ఇప్పించండి

మా అక్క తన విడాకుల అనంతరం మాతోనే ఉంటున్నారు. తనకి ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురి వయసు 29 సంవత్సరాలు. గత ఎనిమిది సంవత్సరాలుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాము. 2023వ సంవత్సరంలో ఒక అబ్బాయి పెళ్లి చూపులకు వచ్చినప్పుడు ''నేను మరొకరిని ప్రేమిస్తున్నాను అని చెప్పింది'' కానీ ఆ అబ్బాయి వివరాలు ఇవ్వలేదు. మేమే ఎలాగోలా అతని ఫోన్ నెంబర్ తెలుసుకుని అబ్బాయిని సంప్రదించగా తనకు జాబ్ వచ్చిన తరువాత మాత్రమే తమ ప్రేమ విషయం ఇంట్లో చెప్తాను అన్నాడు. తన కుటుంబ వివరాలు కూడా మాకు ఇవ్వలేదు. వారిది వైజాగ్ అని మాత్రమే తెలుసు. అమ్మాయిని వేరే సంబంధం చేసుకోమంటే మా మాట వినటం లేదు. ఎలా అయినా సరే అతన్నే పెళ్లి చేసుకుంటాను అంటుంది. ఇలా అయితే లాభం లేదు, ఇంట్లో నుంచి వెళ్లిపొమ్మని గట్టిగా చెప్పాము. అయినా లాభం లేదు. ఇటీవలే అబ్బాయికి ఉద్యోగం వచ్చినట్లు తెలిసింది కానీ, తర్వాత నుంచి మా మేనకోడలితో కూడా మాట్లాడడం మానేశాడు. మా అక్కకి ఆ అబ్బాయితో సంబంధం ఇష్టం లేదు. పరిష్కారం చూపగలరు.

– విజయ, హైదరాబాద్

మీ మేనకోడలు ఒక మేజర్. చట్టప్రకారం తను ఎవరిని పెళ్లి చేసుకోవాలి – ఎవరితో కలిసి బతకాలి, అసలు పెళ్లి చేసుకోవాలా వద్దా అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయం పైనే ఆధారపడి ఉంటుంది. అందులో మూడో వ్యక్తి జోక్యం చేసుకోవటాన్ని చట్టం అంగీకరించదు.అది తల్లిదండ్రులైనా సరే! ఏమి చేసినా ఆ అమ్మాయి అంగీకారంతో మాత్రమే చేయవలసి ఉంటుంది. మీరు చెప్పినదాన్ని బట్టి చూస్తే ఆ అబ్బాయికి ఇంక ఇంట్రెస్ట్ లేనట్టు కనిపిస్తుంది. బహుశా మీ అమ్మాయి ఈ విషయం జీర్ణించుకున్నట్లు లేదు. తనకు కౌన్సిలింగ్ అవసరం అనిపిస్తుంది. మీ అమ్మాయి అతన్ని మాత్రమే పెళ్లి చేసుకుంటాను అనడానికి గల కారణం ఏమిటో ప్రేమగా మాట్లాడి తనకి ధైర్యాన్ని ఇస్తూ కనుక్కోండి. పరస్పర అంగీకారంతో ప్రేమించుకున్నట్టైతే సరేం అలా కాదు ఏదైనా వేరే కోణం ఉందేమో తెలుసుకోండి. శారీరక సుఖం కోసం ప్రేమిస్తున్నాను అంటూ వెంటపడుతూ కోరిక తీరినాక మోసపూరితంగా వదిలేస్తే, అందుకు తగిన శిక్షలు భారతీయ న్యాయ సంహితలో వున్నాయి. కఠిన చర్యలు తీసుకోవచ్చు. ఏది ఏమైనా, ఈ సమయంలో మీరు తనపై మరింత ఒత్తిడి పెట్టడం సరైనది కాదు. మీరు కలిగించే ధైర్యం–నమ్మకం తనకు చాలా అవసరం. కాబట్టి పెళ్ళి సంగతులు కాసేపు పక్కనబెట్టి ముందు తన మానసిక పరిస్థితి, తనకు ఏం కావాలి అనే అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేయండి. వీలైతే కౌన్సెలింగ్ ఇప్పించండి.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

సేవాపథం

పేదోళ్ల వకీలమ్మ



సరళ మహేందర్‌రెడ్డి

'న్యాయవాది కావడం అనేది కేవలం వృత్తికి సంబంధించిన విషయం మాత్రమే కాదు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడం... సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యతను ఎప్పుడూ గుర్తు పెట్టుకోవడం కూడా' అనే ప్రసిద్ధ మాటను న్యాయవాదుల గురించి చెబుతుంటారు.

నిజామాబాద్‌కు చెందిన కాటిపల్లి సరళ మహేందర్‌రెడ్డి న్యాయవాదిగా పేదలకు అండగా ఉండటమే కాదు...'సమాజానికి తిరిగి ఇవ్వాలి' అనే ఎరుకతో తన పాఠశాల ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తోంది. పిల్లలు వివిధ ఆటల్లో జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తోంది.

డిగ్రీ చదువుతున్నప్పుడే వివాహం అయినప్పటికీ భర్త, హైకోర్ట్ న్యాయవాది మహేందర్‌రెడ్డి ప్రోత్సాహంతో ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన సరళ నిజామాబాద్ జిల్లా కోర్టులో ఎన్‌రోల్ అయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మహిళా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసింది. ఉమ్మడి ఏపీ హైకోర్టులో ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా విశాఖ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల బాధ్యతలు చూసింది.

రోడ్డు ప్రమాదంలో మరణించిన తన బావగారు (భర్త అన్న) కాటిపల్లి రవీందర్‌రెడ్డి పేరుమీద ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసి నర్సరీ నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నారు. బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 300 మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించారు. ఈ ఏడాది నుంచి 'బాలసదన్'లో ఉంటున్న 30 మంది అనాథ పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్నారు. 'బాలసదన్' చిన్నారుల కోసం జిల్లా జడ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భవిష్య జ్యోతి' ట్రస్ట్‌కు చైర్‌పర్సన్‌గా సరళ మహేందర్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.

సామాజిక సేవే... విలువైన సంపద

న్యాయవాదిగా పేదలకు అండగా నిలవడమే కాదు సామాజికసేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాల్లో భాగం కావాలనుకుంటున్నాను.

– సరళ మహేందర్‌రెడ్డి



ఆటల్లో మెరిసేలా...

గ్రామీణ విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించేందుకు 'ఖేలో ఇండియా' కార్యక్రమాలు పాఠశాల ద్వారా నిర్వహిస్తున్నారు. ఖోఖో ఆటలను స్పాన్సర్ చేస్తున్నారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు హాకీలో జాతీయ స్థాయిలో ఆడారు. రెండుసార్లు రాష్ట్రస్థాయి జూడో మీట్ నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు జూడోలో రాష్ట్రస్థాయిలో అండర్–17 విభాగంలో 3 కాంస్య పతకాలు సాధించారు. జూనియర్స్, సబ్ జూనియర్స్ సైతం జూడో రాష్ట్ర స్థాయిలో ఆడుతున్నారు.

– తుమాటి భద్రారెడ్డి,
సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

గ్లోబల్ టు లోకల్


జర్మన్ అమ్మాయి... మలయాళం ఎంత చక్కగా మాట్లాడిందో!

విదేశాలకు వెళ్లడం, కొత్త కొత్త ప్రదేశాల్లో విహరించడం బాగానే ఉంటుంది కానీ భాషా సమస్యలు ఇబ్బంది పెడుతుంటాయి. కొందరు వేరే దేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్థానిక భాషలు వారికి ఎప్పుడూ పరాయిగానే ఉండిపోతాయి.

ఎందుకంటే వారు ఎప్పుడూ మాట్లాడరు... మాట్లాడాలని ప్రయత్నించరు!

'నేర్చుకోవాలనే తపన ఉంటే... ఏ భాష అయినా మాట్లాడవచ్చు' అని చెప్పే వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

క్లారా అనే జర్మనీ అమ్మాయి కొంత కాలంగా మన దేశంలో నివసిస్తోంది. ఆమె ఉబర్ క్యాబ్ డ్రైవర్‌తో స్పష్టమైన మలయాళంలో మాట్లాడుతున్న వీడియో క్లిప్ చూసి నెటిజనులు 'ఆహా' అంటున్నారు.



'ఇంగ్లీష్ మాట్లాడే ఫారినర్స్‌నే చూశాను గానీ ఇంత చక్కగా మలయాళం మాట్లాడే ఫారినర్‌ను చూడడం ఇదే మొదటిసారి' అని క్యాబ్‌డ్రైవర్ బోలెడు ఆశ్చర్యపోయాడు.

ఆర్ట్ అండ్ కల్చర్

పాకిస్థాన్‌లో... ప్యార్ కియాతో డర్నా క్యా!

దేశాల మధ్య ఎంత దూరమైనా ఉండవచ్చు. ఎంత శత్రుత్వమైనా ఉండొచ్చు. అయితే కళకు ఆ దూరం తెలియదు. ఆ శత్రుత్వం తెలియదు.

'మొఘల్–ఎ–ఆజం' అనే సినిమా పేరు వినగానే ఒళ్లు పులకరించిపోతుంది. కాలాతీతమైన ప్రేమ కావ్యం ఇది. ఈ సినిమాకు మన దేశంలో ఎంత ఆదరణ, అభిమానం ఉందో పాకిస్థాన్‌లోనూ అంతే. పాక్‌లో ఈతరం ప్రేక్షకులు కూడా ఈ సినిమాను సొంతం చేసుకోవడం విశేషం. తాజా విషయానికి వస్తే...

పాకిస్థాన్‌లోని గవర్నమెంట్ కాలేజీ యూనివర్శిటీ (జిసియూ) విద్యార్థుల బృందం ఈ ఐకానిక్ చిత్రానికి నీరాజనం అర్పించింది.



'మొఘల్–ఎ–ఆజం' చిత్రంలో ఓ సన్నివేశం

'మొఘల్–ఎ–ఆజం' సినిమాను నాటకంగా ప్రదర్శిస్తే ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన ఇంతా అంతా కాదు!